

కాంచనపల్లి

# చినవెంకటరామారావు కథలు



# కాంచనపల్లి చినవెంకటరామారావు
# కథలు

సంపాదకుడు
ఎలికట్టె శంకర్‌రావు

కాంచనపల్లి సాహిత్య ప్రోత్సాహక సమితి

కాంచనపల్లి
చినవెంకటరామారావు కథలు

మొదటి ముద్రణ:
ఏప్రిల్, 2012
పుస్తకాలకు :
డాక్టర్ కాంచనపల్లి ప్రభాకర్‌రావు
ఇంటి నెంబరు 6-3-241
రామగిరి, నల్లగొండ

: ప్రముఖ పుస్తకాల దుకాణాలు

ధర : రూ 60

# ముందుమాట

పుస్తక రూపంలో వెలుగు జూస్తున్న ఈ కథల్లో కొన్ని దేవులపల్లి రామానుజరావుగారి సంపాదకత్వంలో వెలువడ్డ 'శోభ' మాసపత్రికలోను, సురవరం ప్రతాపరెడ్డిగారి 'గోలకొండ' దినపత్రిక లోను, హైద్రాబాదు నుండి వెలువడిన 'తెలంగాణా' దినపత్రిక లోను, ఆనాటి 'ప్రజాశక్తి' వారపత్రిక లోను, 'ఆంధ్రభూమి' దిన పత్రిక, ఇత్యాది పత్రికల్లో ప్రచురించబడినాయి.

'అదనం కోత', 'ప్రమోషన్', 'జై తెలంగాణా– జై ఆంధ్ర' అన్న కథలు యీ మధ్య రాసినవి. తక్కినవన్నీ 1948కి పూర్వం రాసినవి.

కథానికా శిల్పం కథా సంవిధానంలో వుండే ప్రత్యేక విశేషాల వల్ల కాకపోయినా, ఆనాటి తెలంగాణాలో భూస్వామ్య యుగంలోని అన్యాయాలనూ, అక్రమాలనూ ప్రతిబింబించే 'వస్తు' విశేషం కారణంగానే ప్రచురణ భాగ్యానికి నోచుకున్నాయే మోనని నా భావన. ప్రోత్సహించాలన్న పత్రికాధిపతుల సద్భావం కూడా యిందుకు తోడ్పైందనుకుంటాను.

తెలంగాణా రైతాంగ విప్లవపోరాటంలోని వివిధ దశలతో వుడతాభక్తి సంబంధం యింతో అంతో నాకు కూడా వుంది. ఈ కథానికల్లోని వివిధ సన్నివేశాలు నా కళ్ల ముందు జరిగినవి. ఆయా పాత్రలు నాతో కలిసి మెలిసి మమేకంగా వున్నట్టివి. ఆయా

ఘటనలు నన్ను ఉత్తేజపరిచినాయి. కనకనే నా శక్తికి తగ్గట్లుగా వాటిని చిత్రించ ప్రయత్నించినాను. బాగా చిత్రించగలిగినాను. వ్యక్తీకరణ లోపం లేదనుకుంటే, దానికి ఆయా కథల్లోని వస్తువు బలమే తప్ప నా ప్రయోజకత్వం యేమీ లేదు. అలాంటి చిత్రణలో విఫలుణ్ణయితే, ఆ బాధ్యత కేవలం నాదేనని మనవి చేసుకుంటున్నా.

'చస్తి నీ బాంచను' అని లొంగి పడున్న ప్రజానీకం, ఆయా దశల్లో మానవత్వం విలువలు నిలబెట్టుకోవడానికీ, నేనూ మనిషినే అని నిలదొక్కుకోవడానికీ క్రమక్రమంగా తిరుగుబాటుకు తయారైంది. సాయుధ పోరాటం స్థాయికి చేరుకొని భూస్వామ్య విధానాన్నే సవాలు చేసింది. గడగడ లాడించింది. తన పురోగమ నానికి గుదిబండలుగా వున్న వెట్టిచాకిరినీ, జాగీర్దారీ, జమీందారీ విధానాన్నీ, పీడననూ తొలగించడంతో బాటు (అది పరకాయ ప్రవేశం చేసి వేరే రూపంలో వున్నా) భూ పంపక సమస్యకూ, దాని పరిష్కారమార్గాలకూ వరవడి దిద్దింది.

ఆయా దశల్లో ప్రజల తిరుగుబాటు మనస్తత్వంతో బాటు పాలకవర్గాల ధోరణులనూ, మనో భావాలనూ, వర్గ సంఘర్షణలనూ ఈ కథల్లో కొంతలో కొంత ప్రతిబింబించాలన్నదే నా ఆశ.

రచన నా వృత్తి కాకపోయిన కారణంగా, ఆనాటి తెలం గాణాను విరివిగానూ, విశాలంగానూ చిత్రించే ప్రయత్నం చేయలేక పోయానే అన్న అసంతృప్తి నన్ను యెప్పుడూ వెంటాడుతూనే వుంటుంది, వేధిస్తూనే వుంటుంది. మిత్రులు వట్టికోట ఆళ్వారుస్వామి గారికి మృత్యువు యే మాత్రం అవకాశాన్నీ, 'వాయిదానూ' ప్రసాదిం చినా విప్లవ తెలంగాణాను కన్నులకు కట్టినట్లుగా చిత్రించ గలిగేవారు. కాని ఆ అవకాశానికి మనం నోచుకోలేదు. మిత్రులు దాశరథి రంగాచార్యగారు ఆ లోటు దీర్చే ప్రయత్నం చేస్తున్నరు. గంగినేని శక్తివంచన లేకుండా ప్రయత్నించినారు.

తెలంగాణా విప్లవం, దాని ఘట్టాలూ, సన్నివేశాలూ సాహిత్య సృష్టికి తరగని ఒక యిసక పాతర. ఒక గ్రామానికి పోతే ఒక వ్యక్తిని కదిలిస్తే, కథలకూ నవలలకూ కావలసినంత సామగ్రి

లభ్యమవుతుంది. ఆ వస్తువేమీ యింకా పాతబడిపోలేదు. పీడకవర్గం దృష్టితో గాక పీడిత వర్గం దృష్టితో చూస్తే రచనా సామగ్రికి ముడిసరుకు కోకొల్లలు.

ఈ మధ్య జరిగిన తెలంగాణా విప్లవపోరాట రజతోత్స వాలు యీ కథానికా సంపుటాన్ని యేర్చి కూర్చి ప్రచురించడానికి ప్రేరణనిచ్చినాయి. అందుకే ఈ కథా సంపుటిని తెలంగాణా అమర వీరుల స్మృత్యంజలిగా పాఠకలోకం చేతికందిస్తున్నా.

పుస్తకానికి ఈ రూపురేఖలు దిద్దడంలో తోడ్పడిన మిత్రులు నిడమర్తి ఉమారాజేశ్వరరావుగారికీ, తదితర మిత్రులకూ నా కృతజ్ఞతాంజలి.

నల్లగొండ
30-10-1973 — కాంచనపల్లి

# కథా క్రమం


మనవాళ్లో కూడానా ?! ............13

ఆకలి.................................21

చెరువొడ్డున..........................26

మీటింగు ముగిసింది................34

దావతు...............................43

బోడిబట్టె..............................47

అదనం కోత..........................53

ప్రమోషన్.............................60

జై తెలంగాణా! జై ఆంధ్రా !!.........67

మా కాంచనపల్లి .....................77

# మనవూళ్లో కూడానా?

మధ్యాహ్నం ఎండ మిటమిట లాడిపో తున్నది. వడ్లగింజవేస్తే పేలగింజ అయేంత వేడి. వేడిలోకి వేడి నల్లగొండ జిల్లా వేడి. చాలా పేరు మోసిన వేడి. అందరినీ హడలుగొట్టేంత వేడి.

'లోకల్ ఫన్డ్' చెల్లిస్తున్నా నొసటి రాత మారని పల్లెటూరు బాట. ఎండకు తళాతళా మెరుస్తున్నది ఇసుకతో నిండిన బాట. కింద భూమి, పైన ఆకాశం భగ్గున మండిపోయే వైశాఖమాసం.

కనీసం గంటకు పదిమైళ్ల వేగాన్నయినా అందుకోవాలన్న తాపత్రయంతో కచ్చడం బండి బరుగెడు తున్నది. మెళ్లో మూగలు ఘల్లు ఘల్లున మోగుతూ కోడెల అడుగులకు తాళం వేస్తున్నయి. కచ్చడం వెనుక లేచిన దుమ్ము చిన్న చిన్న మేఘాలను సృష్టిస్తున్నది.

రేగిన దుమ్ము కండ్లల్లోకి ముక్కుల్లోకి పోతున్నా మాదిగ పాపయ్య మాత్రం ఆగడానికి వీల్లేదన్నట్లుగా తననేదో రాక్షసశక్తి తరుము కొస్తున్నట్లుగా కచ్చడం బండి ముందు పరుగుదీస్తున్నడు. భుజానికి కర్ర, దానికి తగిలించిన లాంతరు, పాపయ్య అడుగులకు మడుగు లొత్తుతున్నట్లు వూగుతున్నది.

నెత్తిన దొరోరి బట్టల సందుకతో కచ్చడం బండీ వెనుక చాకలి సర్వయ్య సాగిపోతున్నడు. చెమటలు కక్కే శరీరంతో శ్వాస నిగ్గదీసుకొని పరుగుదీస్తున్నడు.

మెత్తని బూరుగుదూది పరుపుమీద కూరుకుపాట్లు పడుతున్నడు పాపారావు దొరగారు. పెద్ద దిండుకు అనుకొన్న శరీరం, కుదుపులకు ఏమీ బాధపడకుండా అన్ని దిక్కులా తలగడాలు అమర్చి ఉన్నయి.

కచ్చడంలో ఒరిగిన ఆజానుబాహు విగ్రహం, ఉబ్బు చెంపలు, నిమ్మకాయలు నిలబెట్టగల నల్లని మీసాలు శరీరఛాయకూడ నల్లనిదై, ఎప్పుడూ నీడన వున్నందున నిగనిగ లాడ్తున్నది.

'చిన్నగ పోనిస్తవేం రా? నడవనీ బండి'

ఈ మాత్రం హెచ్చరికకే యెడ్ల వీపులు 'చడేల్' 'చడేల్' మని మోగినాయి సేవకుడి వెంకయ్య చేతిలోని కౌచకర్ర వార్లు.

బండి వేగం మరింత హెచ్చింది. బండి ముందున్న పాపయ్య, సర్వయ్య పరుగు వేగం కూడ తదనుగుణంగానే హెచ్చింది.

దొరవారు కునుకుపాట్లుపడే సమయంలో పాపయ్య, సర్వయ్యా ఇద్దరూ దొరోరి వెంకన్నతో (వెంకన్నలాంటి వాళ్లకు ఇంటి పేర్లుండవు లెండి) ఒక ఒప్పం దానికొచ్చినారు. ఆ ఒప్పందానికి ఫలితంగా వెంకన్న కడుపునిండా కల్లు దక్కుతుంది.

వెంకన్న జేయాల్సినపని బండి వేగాన్ని తగ్గించడమే. తద్వారా చెమటలు కక్కే, సర్వయ్య, పాపయ్య శరీరాలకు కొంతైనా విశ్రాంతి దొరుకుతుంది.

బండివెంట సరిగ్గా రానందుకు దొరగారు వడ్డించే తిట్లకన్నా, భయంకర మైన కౌచకర్ర దెబ్బలైనా తప్పుతయి.

కాని ఎవరు బాధ్యులైతేనేం? ఒప్పందం భగ్నమైపోయింది. మండు టెండలో కచ్చడంబండి మహా జోరు లంకించుకొంది. వగిరిస్తూ ముందు పాపయ్య వెనక సర్వయ్య ఉరుకుతున్నరు. అడ్డూ, అదుపూ లేని అధికారం గల దొరవారి ఉగ్రనారసింహావతారం దాన్ని కాపాడేందుకు కాపలాగావుండే దొరోరి వెంకన్న, చేతిలోని కౌచకర్ర ఈ రెండూ భయంకరంగా కళ్లకు కట్టినట్లు సర్వయ్య, పాపయ్యల పైన తమ నీడలను దృశ్యా దృశ్యంగా ప్రసరింపచేస్తున్నయి.

బతకలేక బడిపంతులుగా దొరవారి వూళ్లో వున్న స్నేహితుని కలవాలని నా తాపత్రయం. పాతరోగాలు బయటపడ్డట్లుగా యెండకు పాతపంచర్లు పూడిపోయే పాత సైకిలుతో ప్రయాణమయినాను.

పట్నవాసానికి పది ఆమడల దూరం. ప్రయాణానికి బండైనా కావాలి లేక కాలికైనా బుద్ధి చెప్పాలి. బుద్ధి వచ్చేటంత బలమైన కాళ్లు గావు కనక పాత సైకిలే శరణ్యమైపోయింది. పాడుబాటలో బండితో కూడ సరిగ్గా నడిపించలేక పోయినాను. బట్టలన్నీ తడిసి ముద్దయిపోయినాయి. బండికంటే వెనుకపడ్తే పరు వెక్కడ పోతుందన్న రోషంతో వగిరిస్తూ సైకిలు తొక్కుతున్నా.

'ఏయ్! దొరగారు కచ్చడంలో వున్నరు. కోడెలు బెదురుతయ్. దూరం గాపో' భయంకరమైన తన మిడిగుడ్లను వెళ్లబెట్టి బెదిరించినాడు దొరోరి వెంకన్న. బండి యెడ్లు కనబడకుండ వెనకనే వుంటుంది నాకు ప్రాణసమానమైన పదేండ్లనాటి పాతపురాణం సైకిల్. సైకిళ్లయినా, మోటార్లయినా తొలిగి బండ్లకు దారివ్వవల సిందే, ఈ కచ్చడం బండ్ల రాజ్యంలో. అసలు సంగతి తర్వాత తెలిసింది. దొర వారి కచ్చడం కనపడ్డాక సైకిలు దిగి నడవాల్సిందేనట. ఎక్కి పోవటానికి వీల్లేదట.

యెడారి యెండలో ఒయాసిస్‌లాగ దొరవారి వూరు 'కడపురం' వచ్చింది. కచ్చడం బండి వెనుకా, ముందూ వున్న మా అందరి కష్టాలు గట్టెక్కి నట్లయింది.

చాకలి, మంగలి వాడలకు దగ్గరలో మకాం పెట్టిన మా స్నేహితుని ఇంటికి చేరుకున్నా.

నా వెనకనే బెత్తెడు కడుపు జానెడు లోతుకు గుంజుకుపోయిన పాపయ్యా, నర్సయ్యా, అర్ధశేరు జొన్నలేమో మూటగట్టుకొని ఇళ్లు చేరుకున్నరు.

ఎండనబడి వచ్చినందుకు మూడుపాళ్ల నీళ్లు, ఒకపాలు అన్నంతో చిన్నప్పుడు చదివి మరచిన ఆరోగ్యశాస్త్రప్రకారం భోజనం చేయడమనే వాలాయితీ ముగిసింది. యెండకు వూడిపోయిన పంచర్లను అతికిస్తూ మా స్నేహితుని ఇంటిముందు వరండాలో వున్నా.

బల్లెం చెక్కిన చేతికర్రతో బీటలుబారిన బిళ్ల బెల్టు నడుముకున్న నడియీడు మనిషి సర్వయ్యను పిలుస్తున్నడు. 'అరే! సర్వా' అని.

'యేం! కాశీమయ్యా! అంటూ సర్వయ్య ఇవతలకు వచ్చినాడు.

'పట్వారీ సాబు జమాబందీకి నల్లగొండకు బోతున్నడు. దప్తరం ఒరు వొంతు నీదైంది.. పదూ'.

'నీ ఇల్లు బంగారం కాను, ఇప్పుడే కదయ్యా దొరోరి సందూక ఒరు వొంతుకు పోయివస్తిని. ఇంకా బువ్వకూడ తినలేదు. నర్శిగాడు లేడూ? అదే నా తర్వాత వంతోడు'.

'గొల్లోళ్ల కాడ వసూలైన మామూలు యాటలిచ్చి రావటానికి అమీన్ కచ్చేరికి పోయిండు'.

'అయితే చినసర్వడు, సీతిగాడు, నారిగాడు తక్కినోళ్లు ఎవరూ లేరా?'

'కొంతమంది మేనా మోసేటందుకు పోయింద్రు. తక్కినోళ్లు చినదొర కార్యానికి పిండ్లు విసరుతున్నరు. ఇండ్లలికి ముగ్గులేస్తున్నరు. ఇప్పటి వంతు నీదే?'

"కాశీమయ్యా! నిన్న యియ్యాళ్లకే అందరివంతులు గిర్రునతిరిగి నాకాడి కొచ్చినట్లున్నది.'

'అరే! ఏం చేయమంటవు బై! పొద్దటి నుంచి కాలి, బొట్టె కట్టకుండ తిరుగుతున్నా, ఈ పని ఎప్పటికీ తెగేదికాదు.. దొరకాకుంటే చిన్నదొర. వీళ్లిద్దరు దప్పితే పటేలు పట్వారీలు. సంచులు నింపుకోడాని కొచ్చే పోలీసు ఇన్‌స్పెక్టర్లు, గిర్దావర్లు. ప్రతివాడూ సేక్‌సింద్‌కు బులావ్? కోసిన వరి మొత్తలకు మా బూబమ్మ కావలికి పోయింది. ఫుర్సత్ ఎక్కడ బై.'

ఈ సంభాషణ వింటూ నాపని నేను చేసుకొంటున్నా. పంచరు మీద పంచరయింది. దాన్నూడదీయనా? లేక ఆ అతుకుమీదే ఇంకో అతుకు వేతునా అని ఆలోచనా సముద్రంలో మునకలు వేస్తున్నా.

ఇంతలోనే 'వామ్మో వాయ్యో' అని సర్వయ్య ఇంట్లోనుండి చప్పుడు వినవచ్చింది. నేనూ మావాడూ చూడ్డానికి పరిగెత్తి పోయినం. ఇంకా నాకు పల్లె టూరు అలవాటు పోలేదట. మనకేమన్నట్లు పట్టించుకోకుండా పోయే పట్నవాసపు లక్షణాలు నాలో లేవంటున్నడు మావాడు.

మేమొకళ్ల నొకళ్లం విమర్శ, ప్రతివిమర్శ చేసుకొనే అవకాశమెక్కడున్నది.

ఎదురుగా వరహావతారం మూతి వ్యక్తి 'ఇంత ఆలస్యం చేస్తావురా? లంజ కొడకా' అమ్మనాలిని జోకుతున్నడు. దభీ దభీమని ఎక్కడ ఏ ఆయంపట్టున దెబ్బ తగుల్తుందోనన్న విచక్షణ లేకుండా సర్వయ్యను బాదుతున్నడు.

మింగుడు బోవడానికి నీళ్లు పోసుకొని, కారంగలిపిన జొన్న గటక ఎక్కడ నేల పాలవుతుందోనని కొట్టే దెబ్బలు తప్పించుకుంటూ కంచుతట్టితో తనచుట్టు గుడిసెలో కిందా, మీదా పడుతున్నడు సర్వయ్య.

'నేనైతేనా? నెత్తిన తట్టిని ఎత్తేసి కంట్లో కారం వంటి నిండా గటక పడి ఈ వరహావతారం తన్నుకలాడుతుంటే, లేవంగో తన్ను పడంగోతన్ను తన్నే వాడ్ని! వీడి ఓర్పు తల్లిముండమొయ్యా! ఈ సర్వయ్య నోరెత్తడేమిటి?' మావాడితో అన్నా.

'ఇది కడపురం. మీ బస్తీకాదు. గాలికిపోయే కంప మనకెందుకు నోరు మూసుకో. ఇదెప్పుడూ జరిగే కథే' అన్నడు మావాడు.

చుట్టుపక్కల వాళ్లు యల్లయ్య, మల్లయ్యలు గుమి గూడినారు.

'కొట్టకు పంతులూ! పెద్ద ముండాకొడుకు. నీ కాళ్లు మొక్కుతం! వదులు.' అని బతిమిలాడుతున్నరు. కానీ ఈ మంత్రాలకు చింతకాయలేం రాలడంలేదు. సర్వయ్య వంటిమీద కర్ర దెబ్బలు పడుతూనే వున్నయి. అక్కడి ఎవళ్లకూ విడిపించే ధైర్యం లేదు.

కాశీం సాయిబు మాత్రం వీరావేశంతో మధ్యలోకి దూకినాడు. కర్రకు కర్ర అడ్డం పెట్టి 'ఏం, వాన్ని చంపుతావ్ మహరాజ్' అన్నడు.

మాకు కూడ ధైర్యం వచ్చినంత పనైంది. పంతులుగార్ని గుడిశె కివతలకి ఈడ్చుకొచ్చినాం. పంతులుగారికి వళ్లంతా చెమట బట్టింది. కోపావేశంతో వళ్లంతా వణుకుతున్నది. కట్టుపంచె గోచి వూడింది. చెంగులు దోపుకుంటున్నడు. మాటలు తోశ్కె బోతున్నవి. కూలబడినాడు.

'ఇంత పిచ్చి కోపమైతే ఎట్ల పంతులూ' అంటున్నరు అక్కడ గుమిగూడిన పెద్దరైతులు.

కాశీం వైపు కండ్లెర్రజేసి 'ఈ జమాబందీలో నీ యినాం జప్తు చేయించ లేక పోతే నేను మా నాయన కొడుకును గాదురా తురకోడా!' అంటూ పంతులుగారు తన ఇంటివైపు పోయినాడు.

'పోవయ్యా మహరాజ్! ఈ ఇనాం భూంతోటే బతుకుతున్ననా యేమిటి? రెక్కలు చల్లగుంటే ఒంటెద్దు బండితో నల్లగొండలో బతుకుతా!' అన్నడు కాశీం.

గటక తట్టి కిందబెట్టి సర్వయ్య దెబ్బలకు వళ్లు చిట్లి, నెత్తురు గారుతుంటే ప్రాథమిక చికిత్సకై కాబోలు గాయాలమీద మన్ను బోసుకుంటున్నడు. తలమీద పెద్ద గాయమైంది.

'ఏడుపు తప్ప కనీసం వీడికి తిట్టడమన్నా రానట్టుంది. ఫూల్‌కి' అని సర్వయ్య మీద షికాయతు చేసినాను మా వాడితో.

'వాళ్లు కనుక ఈ మాత్రం తట్టుకొని నెట్టుకొస్తున్నరు. నీ వంటి వారైతే ఎప్పుడో జారి పోయేవాడు. తాచుపామంత వడి, జెరుగొడ్డంత పిరికి మీ పట్నం వాసం బాపతు' ఎదురు దాడి చేసినాడు మా వాడు.

ఈ లోగా కొంతమంది యువకులు, యువతులు అక్కడకు చేరినారు.

బాగా కండలు తేలిన శరీరాలు, గ్రీకు విగ్రహాల్లా వున్న వీళ్లకు స్వేచ్ఛ అనేది వుంటే ఎంతో బాగా రాణించేవాళ్లనిపించింది. శరీరానుగుణ్యంగా మేధకూడా వృద్ధి అయేది. ఆడవాళ్లు, మొగవాళ్లందరికీ శరీరాల మీద దెబ్బలు అగుపడు తున్నయి. అట్లు పొంగినట్లుగా దద్దులుకూడా తేలినాయి.

'ఇదేమిటి! సర్వన్నా?' అని అడిగినారు వాళ్లంతా. 'మరి మీ వంటిమీద దెబ్బలేమిటి' అన్నడు తిరిగి సర్వయ్య.

' సున్నాలేస్తుంటే అద్దం మీద చినుకులు పడ్డయని దొర చేతి బెత్తంతో కొట్టిండు చూడు'.

'కారం మెత్తంగ మెదగలేదని కంట్లో జల్లింది దొరసాని.'

'బట్టలు వేళకు తేలేదని రూలు కర్రతో కొట్టిండు పటేలు.'

'పిండి బిరుసుపడ్డదని చిన్న దొర తండ్రి చెప్పు విసిరితే రొమ్మున తగిలింది. పోరగానికి యెట్ల పాలియ్యను తాతా?' అని భోరున ఏడ్చింది.

సర్వయ్య తల గిర్రున తిరిగినట్లయి 'మనం చేసుకున్న పాపం కట్టి కుడుపుతున్నది' అన్నడు.

'మనలను తన్ని చంపటానికి ఈ దొరలు చేసిన పుణ్యం ఏమిటి? మనం ఇలా పడ్తూ వుంటే అలసైపోయింది' అన్నడొక యువకుడు.

'చిన్నా పెద్దా ఎవరితో చెప్పుకొనే దిక్కులేదు. అంతా ఇటువంటోళ్లే. మనం ఏంచేయగలం!' నిరాశగా అన్నడు సర్వయ్య.

'ఇట్లూరుకుంటే లాభంలేదు తాతా"! యేమైనా చేయాల్సిందే! అన్న ఆవేశం అందరిలో పొంగుతున్నది.

'అక్కడెక్కడో పనిబాటలోళ్లు ఎట్టి బందుచేసినారట. ఊరంతా ఒక కట్టుకడ్తే పెద్ద పెద్ద దొరలు కూడ, పడిగె నేలకు కొట్టుకొని వూరుకున్నరట,' అన్నడొకడు.

'అరె ఇంకా మీది వుడుకు నెత్తురు. అవేవో సంగాలంట, తాతలు తండ్రులనాడు లేని ఈ 'కొరివి' మనకెందుకురా' అన్నడు సర్వయ్య.

'యేమన్నా గాని ఆ 'కొరివినే' మనం తెచ్చుకోవలసిందే' అన్నరంతా.

'పోలీసులు, కేసులు, ఖైదులు ఈ సర్కారంత మనమీద విరుచుకపడ్తది. ఏదో ఇంత కలో, గంజో తాగి బతుకుదాంరా!' అన్నడు సర్వయ్య. దొరలు, దొరల వెనుకనున్న యంత్రాంగమంతా కండ్లకు కట్టినట్లయిందేమో, అతనికి.

'తాతా, వయసులో వున్నప్పుడు కర్రతో పులిని జంపిన మొనగాడివంట!

ఏందీ పిరికి మందు? ఇంతకన్న చెడ్డగేం వుండదు ఖైదుఖానా' అన్నరంతా.

'మొగోనోలిగె మూడుదినాలు బతకటం మేలు' అన్న సామెత నాకు జ్ఞాపకం వచ్చిందిరా! అమ్మా! యేమో అనుకున్నా గాని అగ్ని పర్వతాలు వున్నా యిరా ఒక్కొక్కళ్ల గుండెల్లో' అన్నా మా వాడితో.

'ఇప్పుడు పూలు కావటం నీ వంతు' అవి వాడు మాట విసిరినాడు. నాకు చెంప చెళ్లుమన్నంత పనైంది.

ఆలోచనలతో తల పట్టుకున్న సర్వయ్య గాయాలకున్న మన్ను కిందరాలు తున్నది. తక్కిన పనిబాటల వాళ్ల పెద్దలంతా గుమికూడినారు, యేం చేయాలని.

'కుల పెద్దలు గదా అని అడిగినం. ఈ ఆలోచనలు ఇప్పటితో తెగవు. ఇన్ని దినాలు మీరు చెప్పంది సాగింది. ఇప్పుడు మేమన్నది సాగవలసిందే' అన్నరు యువకులు, యువతులంతా.

ఈ వెట్టిపీడ విరగడై పోవాలి, యేమైనా చేయాలి. ఇక ఊరుకో కూడదు అన్న భావం వాతావరణ మంతా వ్యాపించింది.

'పని బాటలోళ్లతో బాటు మేముంటం' అన్నడు పెద్దరైతు రంగయ్య. తక్కిన రైతులంతా మేము మా రంగయ్య తాతతో బాటు వుంటమన్నరు.

వెనుక దొరవారి సేరీదారు తరుముతుంటే మాదిగ పాపయ్య వగిరిస్తూ వురికొస్తున్నడు.

'గుర్రాన్ని దోమి అరక పట్టక రమ్మంటే నఖరాలు చేస్తున్నడు గాడిద'... అని తిడ్తున్నడు సేరిదారు.

వచ్చి గుంపులో కలిసినాడు పాపయ్య. ఇక్కడ కట్టుగట్టాలన్న మాటలు వినేసరికి పాపయ్యకు యేనుగంత బలంవచ్చింది.

'అరక గట్టటానికి నీ అయ్య జీతగాణ్ణా?' అన్నడు పాపయ్య.

'యేమిరా కూస్తున్నవు'

'మాటలు మీరకు. వీళ్లంతా మావాళ్లే. మర్యాద దక్కదు. జాగర్త. పో ఇక్కణ్నుంచి.' అని ఈగను దోమను తోలినట్లుగా సేరిదారును అంటున్నడు పాపయ్య.

మాటకు ముందు 'నీ బాంచను' అనే పాపయ్య స్వరంలోని దృఢత్వం నాకే ఏదో కొత్త స్ఫూర్తి నిచ్చింది.

'శబాష్' అన్న మాట నానోటినుంచి అప్రయత్నంగా వచ్చింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Kanchanapally+China+Venkatarama+Rao+Kathalu**

* * *